RNI.No. TELTEL/2010/32434

# అన్వేషణ నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 118 | గురువారం 3 సెప్టెంబర్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00

# రక్షణ ఎక్స్‌పో - 2026

## డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు

### స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలి

### డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు.

వార్త 2లో





### దిశా సాలియన్ మృతి కేసు.. సీబీఐ

## దర్యాప్తునకు బాంబే హైకోర్టు ఆదేశం..

దివంగత బాలీవుడ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాంబే హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దిశపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీష్ సాలియన్ గత సంవత్సరం బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌పై జస్టిస్ సారంగ్ కోట్వాల్, జస్టిస్ రంజీత్‌సిన్హా రాజా భోసలేలతో కూడిన ధర్మాసనం ఆగస్టు 28వ తేదీన విచారణను ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది.

2



### తమిళనాట ప్రముఖ ఆలయాల్లో

## సెల్‌ఫోన్లపై నిషేధం..

తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు.

2



### 'జీవితం పరుగుపందెం కాదు'..

## ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు.

### రాజీనామా కోరలేదు..

## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు(బుధవారం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు.

2



2

## మేడ్చల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు.. ఐదుగురి అరెస్టు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యుల వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి వైద్య డిగ్రీలు.. అర్హతలు లేకుండానే కొందరు వ్యక్తులు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

## 22ఎ భూములపై అసెంబ్లీలో ఏం మాట్లాడతారో రండి..

### బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్



22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు.

2

### కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు

## కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి

2

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు.



### హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ

## ముఠా గుట్టురట్టు

హైదరాబాద్,

నగరంలోని శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నకిలీ కరెన్సీ తయారీ.. చలామణికి పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నకిలీ నోట్లను తయారు చేసి వాటిని మార్కెట్‌లో చలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా నిఘా పెట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం రూ.2.90 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా నకిలీ నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలు, వివిధ రకాల సామగ్రిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నకిలీ కరెన్సీ చలామణిపై పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. సాధారణ ప్రజలను మోసం చేస్తూ నకిలీ నోట్లను చలామణిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ముఠా పట్టుబడినట్లు తెలుస్తోంది.

# దిశా సాలియన్ మృతి కేసు.. సీబీఐ దర్యాప్తునకు బాంబే హైకోర్టు ఆదేశం..

ఇంటర్‌నెట్ డెస్క్:

దివంగత బాలీవుడ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాంబే హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దిశపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీష్ సాలియన్ గత సంవత్సరం బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌పై జస్టిస్ సారంగ్ కోట్వాల్, జస్టిస్ రంజీత్‌సిన్హా రాజా భోసలేలతో కూడిన ధర్మాసనం ఆగస్టు 28వ తేదీన విచారణను ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సతీష్ సాలియన్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని ఆదేశించింది. దర్యాప్తు సంస్థకి తగిన ఆధారాలు లభించే వరకు ఎవరినీ నేరస్తులుగా పరిగణించరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# తమిళనాట ప్రముఖ ఆలయాల్లో సెల్‌ఫోన్లపై నిషేధం..

చెన్నై,

తమిళనాడులోని దేవాలయాల్లో రీల్స్ చిత్రీకరించే యువతకు బుద్ధి చెప్పేందుకు విజయ్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 52 ప్రధాన దేవాలయాలలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై టీవీకే ప్రభుత్వం పూర్తి స్థాయి నిషేధాన్ని విధించింది. ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచే అమలులోకి వచ్చాయి. మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.హిందూ ధార్మిక, ధర్మాదాయ శాఖ మంత్రి రమేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆలయాలలో కొంతమంది భక్తులు, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాల కోసం రీల్స్ చేస్తున్నారు. అలా వీడియోలు తీయడం వల్ల ఆలయ పవిత్రత దెబ్బతింటోంది. ఇతర భక్తుల ప్రశాంతతకు భంగం కలుగుతోంది. అందుకే ఈ చర్యలు చేపట్టాము' అని తెలిపారు.

### సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేక కౌంటర్లు..

భక్తులు తమ స్మార్ట్‌ఫోన్లను ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్రపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం ఫోన్‌కు 5 రూపాయల చొప్పున డిపాజిట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కెమెరాలేని కీప్యాడ్ మొబైల్ ఫోన్లను ఆలయంలోనికి తీసుకెళ్లడానికి అనుమతి ఉంది.

# 'జీవితం పరుగుపందెం కాదు'.. ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ఇంటర్నెట్ డెస్క్:

ఐఐటీ గువాహటికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబరు 1న జరిగిన ఐఐటీ గువాహటి 33వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలక పాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

### 'జీవితం పరుగుపందెం కాదు'

ఈ సందర్భంగానే ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని కూడా ఇచ్చారు. 'జీవితం పరుగుపందెం కాదు.. మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదు. దానివల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదు' అని సీఎం హిమంత బిశ్వ శర్మ సూచించారు.

# రాజీనామా కోరలేదు.. అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా: కొండా సురేఖ

హైదరాబాద్,

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు(బుధవారం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు.బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# రక్షణ ఎక్స్‌పో - 2026

## డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు

## స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలి

## డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్

ఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్ఠాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.దేశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో - 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# 22ఎ భూములపై అసెంబ్లీలో ఏం మాట్లాడతారో రండి..

## బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్

హైదరాబాద్,

22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఏ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయి లను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

### వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం..

'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జ్ఞనం రాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాం. అయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శస్తావా కేటీఆర్..?. సంస్కార హీనంగా మాట్లాడితే ప్రజలు క్షమించరు. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండండి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాం. టీమ్స్‌పై బీఆర్ఎస్ నిస్సిగ్గుగా మాట్లాడుతోంది. నిరసన తెలిపేందుకు అవకాశం లేకుండా ధర్నాచౌక్ ఎత్తేసిన మీరా.. స్వేచ్ఛ గురించి మాట్లాడేది. కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహించారు.

### కొత్తగా మూడు లక్షల పెన్షన్లు ఇస్తాం..

'మీ 3,475 రోజుల పాలన కంటే, మా వెయ్యి రోజుల పాలనే బాగుందని ప్రజలు చెబుతున్నారు. మీరు పేదలకు ఇళ్లు ఇచ్చారా?, రేషన్ కార్డులు ఇచ్చారా?. కొత్తగా మరో మూడు లక్షల పెన్షన్లు ఇవ్వబోతున్నాం. ఖమ్మంలో పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని కేసీఆర్ అన్నారు. భద్రాచలం రాములోరి గుడికి రూ.1000 కోట్లు ఇస్తానని దేవుడినే మోసం చేశారు. మా మేనిఫెస్టోలో పెట్టినవన్నీ మేము ఇంకా పూర్తి చేయలేదు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తాం. కోర్ ప్రాంతంలో మేము డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తున్నాం. విలువైన భూములను పేదలకు ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారు. మీరు ఆర్టీసీ ఎక్స్ రోడ్డు నుంచి అసెంబ్లీ వరకు పొర్లు దండాలు పెట్టినా మేము పేదలకు ఇళ్లు కట్టించి తీరుతాం. నేను వాస్తవాలు చెబితే మీరు తల ఎక్కడ పెట్టుకుంటారో చూద్దాం. ధరణితో మీరు కొల్లగొట్టిన భూములపై విచారణ జరుగుతోంది. మీరు ఏం వ్యాపారం చేశారని.. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి..?. మీ బండారం శకుని మామ కూతురు దగ్గర ఉంది. ముందు దానికి సమాధానం చెప్పండి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు.

### మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి..?

'సొంత ఆడబిడ్డకు న్యాయం చేయని మీరు పేద ఆడపడుచులకు న్యాయం చేస్తారా?. ఎంతమంది దళితులకు భూములు ఇచ్చారు, దళిత బంధు ఎంతమందికి ఇచ్చారు. మీ కుటుంబానికి వేల కోట్లు ఎలా వచ్చాయి.?. ఈ రాష్ట్రాన్ని కొల్లగొడితే మీకు వచ్చిన డబ్బులు కావా?. దేశంలోనే రిచెస్ట్ ధనిక పార్టీ ఎలా అయింది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తన పాత్ర పోషించకపోవడం దురదృష్టం. ముసుగు తీసి బయటకొస్తే గులకరాళ్లతో కొడతారని భయమా..?. ప్రజల ఇబ్బందులపై మంచి సూచనలు ఇవ్వొచ్చు కదా?. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష హోదాకు అనర్హులు. మీరు బీజేపీతో జత కట్టారని కవిత చెప్పింది నిజమే అనిపిస్తోంది. ముందు మీ ఇళ్లు చక్కపెట్టుకోండి. ఉస్మానియా యూనివర్సిటీకి మేము చేస్తామన్నది కచ్చితంగా చేస్తాం' అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి

జనగామ,

బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు. ఈరోజు (బుధవారం) లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.

### కవిత లేవనెత్తిన అంశాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి..

దోచుకున్న సొత్తును లెక్కపెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరంలోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.

### ప్రభుత్వ సొమ్మును కేసీఆర్ దుర్వినియోగం చేశారు..

కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబం అయ్యిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా కూడా తెలంగాణ ప్రజలు బాగుపడలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

# మేడ్చల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు.. ఐదుగురి అరెస్టు

మేడ్చల్,

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నకిలీ వైద్యుల వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి వైద్య డిగ్రీలు.. అర్హతలు లేకుండానే కొందరు వ్యక్తులు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో కుత్బుల్లాపూర్ ఎస్ఓటీ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పలు ప్రాంతాల్లో తనిఖీలు.. దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న ఐదుగురు నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ పరిధిలో ఇద్దరు, జగద్గిరిగుట్ట, పెట్ బషీరాబాద్, సూరారం పరిధిలో ఒక్కొక్కరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అర్హతలు లేకుండా అల్లోపతి మందులు విక్రయించడంతో పాటు రోగులకు వైద్యం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

### భారీగా మందులు, వైద్య పరికరాలు స్వాధీనం..

నిందితుల వద్ద నిర్వహించిన తనిఖీల్లో భారీగా మందులు, వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా వైద్య అర్హతలు లేని వ్యక్తులు అల్లోపతి వైద్యం చేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# పేదల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్.. ప్రజా సంక్షేమమే ఆయనకు నిజమైన నివాళి

### దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

### దేవరకొండ నియోజకవర్గంలో 242 మంది లబ్ధిదారులకు రూ.1.12 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

### వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ డయాలసిస్ కేంద్రం 5 పడకల నుంచి 10 పడకలకు విస్తరణ

### దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల కోసం ఇక నల్లగొండకు వెళ్లాల్సిన అవసరం లేదు.. దేవరకొండలోనే వారానికి రెండు రోజులు సదరం క్యాంపులు

దేవరకొండ: పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు మాట్లాడుతూ.. వైఎస్సార్ పేరు చెబితే పేద ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక న్యాయం గుర్తుకు వస్తాయని అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు.“వైఎస్సార్ గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పేదల కోసం చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపాయి. పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన రాజకీయమని ఆచరణలో చూపించిన మహానేత వైఎస్సార్” అని బాలు నాయక్ గారు అన్నారు.

**242 మంది లబ్ధిదారులకు రూ.1.12 కోట్ల సీఎం సహాయనిధి చెక్కులు**

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 242 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాలు నాయక్ గారు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు.“ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు కుటుంబానికి ఆర్థిక భారం ఎంత తీవ్రంగా ఉంటుందో నాకు తెలుసు. పేద కుటుంబం వైద్యం కోసం అప్పులపాలు కాకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశం. అందుకే అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నాం” అని ఎమ్మెల్యే తెలిపారు.లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న సహాయానికి ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

**దేవరకొండలో డయాలసిస్ సేవల విస్తరణ.. 5 పడకల నుంచి 10 పడకలకు**

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 5 పడకల సామర్థ్యంతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు పెంచినట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తెలిపారు.కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ సౌకర్యాన్ని విస్తరించామని చెప్పారు.“పేద రోగులకు వైద్యం అందుబాటులో ఉండాలి. డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకునే పరిస్థితి ఉండకూడదు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తాం” అని బాలు నాయక్ గారు అన్నారు.

**దివ్యాంగులకు మరింత చేరువగా సదరం సేవలు**

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ కోసం గతంలో నల్లగొండ జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి రావడంతో ప్రయాణం, సమయం, ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, అధికారుల సహకారంతో ఇప్పుడు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వారానికి రెండు రోజులు---ప్రతి సోమవారం, శుక్రవారం---సదరం క్యాంపులు నిర్వహించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.“దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం నల్లగొండకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వ సేవలు ప్రజల దగ్గరకు రావాలి.. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకూడదు. ఇదే ప్రజా పాలన లక్ష్యం” అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.దివ్యాంగుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, వారికి అవసరమైన సంక్షేమ పథకాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**వైఎస్సార్ ఆశయాలతో.. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో సంక్షేమానికి పెద్దపీట**

దివంగత వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తెలిపారు.“వైఎస్సార్ గారు పేదల కోసం ఏ విధంగా ఆలోచించారో.. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పేదలకు వైద్యం, ఇళ్లు, రేషన్, రైతులకు సంక్షేమం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం” అని అన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో వైద్య, విద్య, రహదారులు, సాగునీరు, తాగునీరు, సంక్షేమం తదితర రంగాల్లో మరిన్ని అభివృద్ధి



కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మారుపాక సురేష్ గౌడ్, చింతపల్లి మండల అధ్యక్షుడు జటావత్ హరినాయక్, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎరుకల వెంకటయ్య గౌడ్, ఊట్కూరి వేమన్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మంతపురిలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17వ వర్ధంతి

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ -- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17వ వర్ధంతి కార్యక్రమాన్నీ



నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన మహానేత అని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వారి సమస్యలకు పరిష్కారం చూపేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.ప్రత్యేకంగా రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, విద్య, సాగునీరు, గృహ నిర్మాణం వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని అన్నారు.డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని బీర్ల అయిలయ్య గారు పేర్కొన్నారు. ముఖ్యంగా పేదవాడి ఇంటికి ప్రభుత్వం చేరువ కావాలనే ఆలోచనతో ఆయన పనిచేశారని, అందుకే ఆయనను ప్రజలు ఆప్యాయంగా “మహానేత”గా గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని బీర్ల అయిలయ్య గారు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి సేవలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో నడుస్తూ పేదలు, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని బీర్ల అయిలయ్య గారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారికి ఘన నివాళులర్పించారు.

# మదర్ థెరిసా మహిళా పొదుపు సంఘంపై ఆరోపణల పరంపర

### ఆర్థిక లావాదేవీలు, వడ్డీ రేట్లు, ఖాతాల నిర్వహణపై సమగ్ర విచారణకు డిమాండ్

మంథని పట్టణంలోని మదర్ థెరిసా మహిళా పొదుపు సంఘంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. సంఘం నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు, సభ్యుల పొదుపు సొమ్ము, రుణాల వ్యవహారం, వడ్డీ రేట్లు, లాభాల్లో సభ్యులకు వాటా తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని గంగాపురికి చెందిన నామాని గౌరమ్మ కుమారుడు నామాని హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మంథనిలోని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, మదర్ థెరిసా మహిళా పొదుపు సమితి వ్యవహారాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులను వివరాలు కోరినట్లు తెలిపారు. సంఘం నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు, సభ్యుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలు, రుణాలు, వడ్డీ తదితర అంశాలపై సమాచారం కోరినట్లు చెప్పారు. ఆ వివరాల ఆధారంగా ఆగస్టు 28న పాత్రికేయులకు ప్రకటన చేసినట్లు తెలిపారు.తన ప్రకటనకు స్పందిస్తూ ఆగస్టు 29న పొదుపు సంఘం నిర్వాహకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణలను ఖండించారని హరికృష్ణ పేర్కొన్నారు. అయితే ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు, లెక్కలు, అధికారిక రికార్డులను ప్రజల ముందుంచకుండా కేవలం ఆరోపణలను ఖండించడం వల్ల సమస్య పరిష్కారం కాదని అన్నారు.సంఘం నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేకపోతే తాను కోరిన వివరాలను అధికారికంగా వెల్లడించాలని కోరారు. ఆరోపణలకు సమాధానం చెప్పే బదులు వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. సంఘం పారదర్శకంగా నిర్వహించబడుతున్నట్లయితే సంబంధిత రికార్డులు, లెక్కలు, ఆడిట్ వివరాలను పరిశీలనకు అందుబాటులో ఉంచడం ద్వారా అనుమానాలను నివృత్తి చేయవచ్చని అన్నారు.తాను ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ఈ అంశాన్ని లేవనెత్తడం లేదని హరికృష్ణ స్పష్టం చేశారు. పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళలు తమ కష్టార్జిత





సొమ్మును పొదుపు చేస్తున్నందున, ఆ డబ్బుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే వివరాలు కోరుతున్నానని తెలిపారు.సంఘంలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక భద్రత, వారి పొదుపు సొమ్ము రక్షణ, రుణాల నిర్వహణ, వడ్డీ లెక్కలు తదితర అంశాలపై స్పష్టత అవసరమని అన్నారు. అధికారులు అధికారిక రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడిస్తే సభ్యుల్లో ఉన్న అనుమానాలు తొలగిపోతాయని పేర్కొన్నారు.ఇదే క్రమంలో ఆగస్టు 31న పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు మదర్ థెరిసా మహిళా పొదుపు సంస్థ నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలపై విచారణ జరిపించాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు హరికృష్ణ తెలిపారు. తన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు, జిల్లా సహకార అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.సంఘం సభ్యులకు అందిస్తున్న రుణాలపై ఎంత వడ్డీ వసూలు చేస్తున్నారు? ఆ వడ్డీని ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారు? సభ్యుల నుంచి వసూలైన వడ్డీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారు? సంఘానికి వచ్చే లాభాల్లో సభ్యులకు ఎంత మేరకు వాటా కల్పిస్తున్నారు? వంటి అంశాలపై సమగ్రంగా విచారణ జరపాలని హరికృష్ణ డిమాండ్ చేశారు.అలాగే సంఘం నిర్వహిస్తున్న ఖాతాలు, సభ్యుల లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, బ్యాంకు ఖాతాలు, ఖాతాల వివరాలు, నగదు లెక్కలు తదితర అంశాలను పరిశీలించాలని కోరారు. ఖాతాల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్న అనుమానాలపై కూడా అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.మదర్ థెరిసా మహిళా పొదుపు సమితికి సంబంధించిన నమోదు వివరాలు, నిర్వహణ విధానం, సభ్యుల సంఖ్య, కార్యవర్గం, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఆడిట్ నివేదికలు తదితర రికార్డులను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాలని హరికృష్ణ కోరారు.సంఘంపై తాను చేస్తున్న ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారుల విచారణలో తేలుతుందని, అందువల్ల ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రికార్డుల ఆధారంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. మహిళల పొదుపు సొమ్ముకు సంబంధించిన వ్యవహారం కావడంతో అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని అన్నారు.“ఆరోపణలు తప్పయితే అధికారిక రికార్డులతో వాటిని ఖండించాలి. నిజానిజాలు తేలాలంటే వ్యక్తిగత విమర్శలు కాకుండా లెక్కలు, రికార్డులు, ఆడిట్ వివరాలు పరిశీలనకు రావాలి” అని హరికృష్ణ పేర్కొన్నారు. ఇప్పటికే పొదుపు సంఘం నిర్వాహకులు తమపై వచ్చిన ఆరోపణలను ఖండించిన నేపథ్యంలో, అధికారుల విచారణలో ఎలాంటి వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక రికార్డులు, ఖాతాలు, ఆడిట్ వివరాల పరిశీలన పూర్తయిన తర్వాతే ఆరోపణల్లో వాస్తవమెంత, అవాస్తవమెంత అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# అర్ధరాత్రి అనవసరంగా తిరిగితే చర్యలు

### అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి ‘ఆపరేషన్ చబుత్రా’

### గంజాయి స్థావరాలు, బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా.. 30 మంది యువకుల అదుపులోకి

### గోదావరి ఖని ఏసీపీ మడత రమేష్

రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ‘ఆపరేషన్ చబుత్రా’ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని ఒకటో పట్టణం, రామగుండం సర్కిల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.గోదావరిఖని ఒకటో పట్టణం, ఎన్టీపీసీ, రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బైక్‌లపై రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, వీధులు, రహదారులపై గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని, మద్యం





సేవించి ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న యువకులను, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో 30 మంది యువకులను, వారి ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారికి మద్యం సేవించి వాహనం నడిపినట్లు నిర్ధారించేందుకు పరీక్షలు నిర్వహించి, వారిపై చిన్నపాటి కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


గంజాయి స్థావరాలు, బెల్ట్ దుకాణాలపై నిఘా

ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో విస్తృతంగా రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి వినియోగం లేదా విక్రయానికి అవకాశం ఉన్న ప్రాంతాలు, బెల్ట్ దుకాణాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు చెప్పారు.తనిఖీల్లో కొంతమందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రెండు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.రాత్రి 10 గంటల తర్వాత యువకులు అనవసరంగా రోడ్లపై గుంపులుగా తిరగడం, వాహనాలతో విన్యాసాలు చేయడం వంటివి చేస్తే అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండి రాత్రివేళల్లో అనవసరంగా బయటకు వెళ్లకుండా చూడాలని సూచించారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఏసీపీ సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి వేళల్లో బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.‘ఆపరేషన్ చబుత్రా’లో పట్టుబడిన వారి వాహనాలను స్వాధీనం చేసుకుని, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రజలు రాత్రి, పగలు అనే తేడా లేకుండా స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జీవించేలా నిరంతరం పెట్రోలింగ్, తనిఖీలు నిర్వహిస్తూ పటిష్టమైన పోలీసింగ్ అందిస్తామని పేర్కొన్నారు.

అన్వేషనేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# భగవత్ 'సామరస్య' స్వరం




న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన వన్ వరల్డ్ : వన్ హ్యూమానిటీ ఫెయిత్ లీడర్స్ సమ్మిట్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 'ముస్లింలను భారతదేశం నుంచి వెళ్లగొట్టాలని భావించే వ్యక్తి హిందువుగా కొనసాగలేడు' అని చేసిన వ్యాఖ్యలు అనేక చర్చలకు దారి తీస్తోంది. భారత్‌లో 'భిన్నత్వంలో ఏకత్వం' సిద్ధాంతాన్ని ఆయన ప్రస్తావించడం విస్మయం గొలుపుతోంది. ఎందుకంటే ఆర్ఎస్ఎస్ చరిత్రలో ప్రముఖ నాయకుల్లో ఒకరైన ఎంఎస్ గోల్వాల్కర్ ఆనాడు భారతదేశానికి అత్యంత శత్రువులుగా ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులని తన ప్రసంగాల సంకలనం 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే పుస్తకంలో స్పష్టం చేయడాన్ని ఇప్పుడు చర్చల్లో ప్రస్తావనకు ఉదహరించడమవుతోంది. ప్రస్తుతం మోహన్ భగవత్ అమెరికా లో వెల్లడించిన అభిప్రాయాలకు ఆనాడు గోల్వాల్కర్ వెల్లడించిన అభిప్రాయాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఆర్ఎస్ఎస్ పాత భావజాలాన్ని భగవత్ విస్మరిస్తున్నారా? రాజకీయాభిప్రాయాలను అన్వేషించడం హైదరాబాద్ వార్తలు ఆర్ఎస్ఎస్‌ను చాలా లోతుగా పరిశీలించిన వారికి వైవిధ్యాన్ని ఆ సంస్థ ప్రోత్సహించడం కానీ, సమర్ధించడం కానీ చేయదని, ఎప్పటినుంచో 'సాంస్కృతిక జాతీయవాదం"అనే సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందని చాలా మందికి తెలుసు. ఆ సిద్ధాంతం ప్రకారం భారతీయ సంస్కృతికి మూలం హిందూ సంస్కృతియే అని ఆర్ఎస్ఎస్ ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. చాలామంది భారతీయుల ఆలోచనా విధానాల్లో స్థిరపడిన 'భిన్నత్వంలో ఏకత్వం' భావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. భగవత్ దృష్టిలో భిన్నత్వం అనేది ప్రత్యేకతలను విడదీసే భావన కాదు. అది పరస్పర పూరకమైనది. 'మనలో సహజంగా ఉన్న ఏకత్వానికి భిన్నత్వం ఒక అలంకారం: దాన్ని కాపాడాలి' అని భగవత్ తన అభిప్రాయాలను వెల్లడించారు. క్రైస్తవ, యూదు, హిందూ, ఇస్లాం మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న ఫెయిత్ లీడర్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. 'మనుషుల మధ్య ఉన్న వైవిధ్యం, మన సహజమైన ఏకత్వాన్ని దెబ్బతీయదు. హిందూపూజా సామాగ్రిని ఆర్డర్ చేయడం మరిన్ని కనుగొనండి హిందూ పూజా సామాగ్రిని ఆర్డర్ చేయడం రాజకీయ వార్తలు మరియు విశ్లేషణలను అనుసరించడం సామాజిక ఉద్యమ ప్రచారాలకు మద్దతు ఇవ్వడం దాని వెనుక ఉన్న అంతర్లీన సత్యం ఏకత్వం. అందువల్ల మన స్వంత ప్రత్యేకతను ఎలా గౌరవించి కాపాడుకుంటామో, అలాగే ఇతరుల ప్రత్యేకతను కూడా గౌరవించి రక్షించాలి' అని భగవత్ తన తాత్విక ఆలోచనలను చక్కగా వివరించారు. 2018లో కూడా భగవత్ ఇదే విధంగా సమగ్రత, సర్వమత సామరస్యం ప్రస్తావించారు. 'ప్రపంచంలో అన్ని మార్గాలు చివరికి ఒకే లక్ష్యాన్ని చేరుకుంటాయి' అని ప్రాచీన రుషుల బోధనను గుర్తు చేశారు. చరిత్రలో ఇతర దేశాల్లో రక్షణ లభించని వివిధ మతాలకు చెందిన ప్రజలకు భారతదేశం ఆశ్రయం ఇచ్చిందని ఉదహరించారు. చాలా కాలం క్రితం స్వామి వివేకానంద ప్రపంచ మత మహాసభలో చేసిన ప్రసంగ ంలోని మత సామరస్యం, అన్ని మతాలను గౌరవించే భారతీయ సంప్రదాయం తదితర భావాలను గుర్తుకు తెస్తున్నాయి. భారతదేశ వ్యవస్థాపక నేతలు భారత దేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు కలిసిన సమాహారంగా స్పష్టంగా విశ్వసించారు. వాటన్నిటినీ గౌరవించి, రక్షించినప్పుడే దేశం ఐక్యంగా, విజయవంతంగా ఉంటుందని విశ్వసించారు. కానీ ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం లోని కొన్ని ప్రాథమిక సూత్రాలను, ముఖ్యంగా సమాఖ్యవ్యవస్థను ఎప్పుడూ సమర్థించలేదు. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు, ప్రభుత్వాలు కూడా ప్రజలందరినీ కలుపుకుని పనిచేసేందుకు, తమకు ఉన్న సమస్యలను, ప్రయోజనాలను గుర్తించేందుకు సహాయం చేయడానికి బదులు, మతపరమైన భేదాలను ముందుకు తెస్తున్నాయి. 'వందేమాతరం' గేయంపై ముసురుకున్న వివాదం. దేశభక్తికి సంబంధించిన ఒక గీతం లేదా చిహ్నం విషయంలో కూడా ప్రజల మధ్య మతపరమైన విభేదాలు, పెరిగే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం. దేశం కోసం అందరూ కలసి పనిచేసే అంశాలను ముందుకు తేవడం కంటే 'ఎవరు ఏ మతానికి చెందినవారు?' అనే ప్రశ్నకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దాదాపు 80 సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ మనుగడ సాగిస్తోంది. గతంలో భారత దేశాన్ని, హిందూ సమాజాన్ని, ఇతర మతాల ప్రజల స్థానాన్ని వేర్వేరుగా చూసేది. అలాంటిది ఇప్పుడు భారతదేశం అన్నిమతాలకు చెందిన ప్రజలదే అనే సామరస్య భావాన్ని స్పష్టంగా అంగీకరిస్తే అది స్వాగతించదగిన పరిణామమే అవుతుంది. ఇటీవల కొన్నాళ్లుగా భగవత్ చేసిన వ్యాఖ్యల్లో మత సామరస్యం తొంగిచూస్తోంది. సామాజికఉద్యమ ప్రచారాలకు మద్దతు ఇవ్వడం అనే తేడాల కంటే భారతీయుల మూలాలన్నీ ఒకటేనని, దేశంలో నివసించే ప్రతి ఒక్కరికీ వారు ఏ మతాన్ని అనుసరించినా, సుమారు 40,000 సంవత్సరాల క్రితం వరకు ఒకే మూలమైన డిఎన్ఎ ఉందని పలుమార్లు భగవత్ ప్రస్తావించడం గమనార్హం. ప్రతి ముస్లిం ప్రార్థనా స్థలంలోనూ ఒక శివలింగం ఉందేమో అన్న అనుమానంతో వెతకవద్దని సూచించారు. సంప్రదాయవాదులకు ఈ వ్యాఖ్యలు మింగుడుపడకపోయినా సామరస్య భావజాలం కలిగిన వారికి ఈ మార్పులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో విద్యార్థులు, యువత కదంతొక్కినప్పుడు వారి నిరసనలను దేశ వ్యతిరేక చర్యలుగా చూడకుండా, వారి ఆలోచనలు, అసంతృప్తి,

# మరోసారి ఉద్యోగులపై వేటు వేయనున్న అమెజాన్

**వాషింగ్టన్ :**

ప్రముఖ ఇ - కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. హ్యూమన్ రీసోర్స్ (హెచ్ఆర్) విభాగం నుండి 15శాతం సిబ్బందిని తొలగించనున్నట్లు సంస్థ ప్రకటించింది. హెచ్ఆర్ యూనిట్‌పై తీవ్రంగా ప్రభావం




పడనుందని, అయితే ఇతర విభాగాల్లో కూడా ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఫార్చ్యూన్ ఉదహరించిన పలు వర్గాలు తెలిపాయి. ఇటీవల కంపెనీ కన్స్యూమర్ డివైసెస్ గ్రూప్, వండరీ పాడ్‌కాస్ట్ విభాగం మరియు అమెజాన్ వెబ్ సర్వీసెస్ నుండి కొద్దిమంది ఉద్యోగులను తొలగించిన కొన్ని నెలల అనంతరం ఈ చర్య వచ్చింది. అయితే సంస్థ ఎప్పుడు, ఎంత మంది ఉద్యోగులను తొలగించనుంది అన్న వివరాలపై స్పష్టత లేదు. ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) కోసం అమెజాన్ వందకోట్లకు పైగా ఖర్చు చేయడంతో ఈ తొలగింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కంపెనీ 100 బిలియన్ డాలర్లకు పైగా మూలధన పెట్టుబడుల కోసం వినియోగించనున్నట్లు ప్రకటించింది. దీనిలో అత్యధిక భాగం ఎఐ మౌలిక సదుపాయాల కోసం వినియోగించనుంది.

# రూపాయి చారిత్రాత్మక పతనం

డాలర్‌తో పోల్చితే 88.80కు క్షీణత

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడిపోయింది. రూపాయి చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో ఇంట్రాడేలో 88.81కు పతనమయ్యింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లతో దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం నెలకొనడంతో రూపాయిపై ఒత్తిడి నెలకొందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, ఎఫ్ఐఐలు తరలిపోవడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని రికార్డ్ కనిష్టానికి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు పతనమై 88.80కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.81 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 30న 88.80 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది.

# ధరలకు బ్రేక్.. కొనుగోళ్ల జోరు

గడపగడపకు జిఎస్‌టితో ముచ్చటయ్యే పండుగ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆర్థిక మంత్రి సీతారామన్ సామాన్యుడి బడ్జెట్‌కు మరింత ఊరట కొనుగోలు శక్తివంతంతో ఆర్థిక రంగ బలోపేతం న్యూఢిల్లీ: ప్రజా ప్రయోజనాల సంస్కరణలో జిఎస్‌టి ప్రక్షాళన మైలురాయి, అత్యంత కీలకం అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పన్నుల వ్యవస్థలో చేపట్టిన మార్పులు చేర్పులు ప్రతి కుటుంబానికి చేరుతాయి. మంచి చేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక రంగంలో అత్యంత కీలక మార్పుల జిఎస్‌టి ప్రక్షాళన గడపగడపకు జిఎస్‌టితో ముచ్చటయ్యే పండుగ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆర్థిక మంత్రి సీతారామన్ సామాన్యుడి బడ్జెట్‌కు మరింత ఊరట కొనుగోలు శక్తివంతంతో ఆర్థిక రంగ బలోపేతం

**న్యూఢిల్లీ:**

ప్రజా ప్రయోజనాల సంస్కరణలో జిఎస్‌టి ప్రక్షాళన మైలురాయి, అత్యంత కీలకం అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పన్నుల వ్యవస్థలో చేపట్టిన మార్పులు చేర్పులు ప్రతి కుటుంబానికి చేరుతాయి. మంచి చేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక రంగంలో అత్యంత కీలక మార్పుల జిఎస్‌టి ప్రక్షాళన దశలో ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి ఆర్థిక మంత్రి శనివారం ఇంటర్వ్యూ ఇచ్చారు. నిత్యావసర సరుకులు , విలాస సరుకులు, ఎలక్ట్రానిక్ సామాగ్రి ఈ విధంగా అనేక వినిమయ వస్తువు జిఎస్‌టి మార్పులను సంతరించుకుంటుంది. ఇంటింటికి గడపగడపకు దీని ప్రభావం కనబడుతుంది. పైగా తలసరి వినియోగం ఇనుమడిస్తుంది. దీనితో దేశ ఆర్థిక రంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. సరుకుల కొనుగోళ్ల శక్తి పెరగడం అనేది భారతీయ విస్తృత మార్కెట్‌కు ఉపకరించే అంశం అవుతుందన్నారు. సఖి లాంటి ఫ్యామిలీ మూవీ 'డ్యాడ్' మరిన్ని కనుగొనండి ఆంధ్రప్రదేశ్ వార్తలు కెరీర్ మార్గదర్శకత్వం బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ జీవిత బీమా పాలసీలు ప్రయాణ బీమా ఆధ్యాత్మిక పుస్తకాలు ఆన్‌లైన్ క్రీడా పరికరాలు వార్తా సేవ ఈ-పేపర్ చందా ఈ-పేపరు చందా త్వరలోనే ప్రజల నెలవారి బడ్జెట్ గతంతో పోల్చుకుంటే సవ్యమైన దిశలో ఉంటుందన్నారు. సరుకులు సేవల పన్ను (జిఎస్‌టి) రేట్ల తగ్గింపు ద్వారా ధరలు తగ్గేలా చూసేందుకు తాను వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేస్తామన్నారు. ఇటువంటి తగ్గింపులకు పరిశ్రమలు కూడా ఆసక్తి చూపడం మరో మంచి పరిణామమని చెప్పక తప్పదని వెల్లడించారు. ఉత్పత్తిదార్ల తక్షణ స్పందనను ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంటుందన్నారు. జిఎస్‌టి మార్పుల నిర్ణయం కొద్ది రోజులకే కార్ల తయారీదార్లు మొదలుకుంటే ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు, పాదరక్షల , నగలు వజ్రాల బ్రాండ్ల వరకూ తమ ధరలలో గణనీయ తగ్గింపు ప్రకటించాయని, ఇది అనూహ్యమని వివరించారు. నూతన రేట్ల అమలు స్థాయిలో మరెన్నో సరుకుల ధరలు భారీ స్థాయిలోనే తగ్గుతాయని తెలిపారు. ఇది పండుగల సీజన్‌కు ముందస్తు పండుగ అవుతుందన్నారు. ఒకే రకమైన చిత్రాల్ని చేయడం ఇష్టం ఉండదు... పాలు, బ్రెడ్డు, పన్నీరుపై పన్ను ఉండదు సంస్కరణల్లో భాగంగా ఇకపై పాలు బన్నులు, పన్నీరు వంటి వాటిపై ఎటువంటి జిఎస్‌టి భారం ఉండదు. అన్ని అంశాలను సరైన రీతిలో పరిశీలించుకుని, క్రమపద్ధతిలో ప్రజల అవసరాలను, మా ర్కెట్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే ఈ మార్పులు చేసినట్లు సీతారామన్ చెప్పారు. సవ్యమైన సమీక్షల ఈ బృహత్తర కార్యక్రమంతో ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వివరించారు. త గ్గుదలతో శ్లాబ్‌ల శాస్త్రీయతతో ప్రజల వద్ద మరిం త డబ్బు ఆడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇంతకు ముందు ఓ వందరూపాయలతో మార్కెట్‌కు వెళ్లి కొనుక్కున్న సరుకులను ఇప్పుడు అదే వందతో తెచ్చుకునే సరుకులను సరిపోల్చుకోవచ్చునని చెప్పారు. ఇంతకు ముందుతో పోలిస్తే ఒక్కటిన్నర శాతం వరకూ ఎక్కువ మన బ్యాగుల్లోకి చేరుతాయన్నారు. ఇంతకు ముందు కొన్ని రకాల వస్తువులు , ప్రత్యేకించి ఆహార సరుకుల వర్గీకరణలో తలెత్తిన గందరగోళాన్ని ఇప్పుడు లేకుండా చేసినట్లు వివరించారు. ఇంతకు ముందు క్రీమ్‌బన్నులు 18 శాతం శ్లాబ్‌లో ఉండేవి. దీనిని ఇప్పుడు 5 శాతం పరిధిలోకి తీసుకువచ్చారు.



అన్వేషనేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

బిజినెస్..

# ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భేష్..


**ఎంఎస్ఎంఇలకు మద్దతును పెంచాయి**

**రుణాల జారీలో ప్రయివేటు బ్యాంక్‌ల కంటే మెరుగు**

**ఆర్థిక సేవల కార్యదర్శి ప్రశంస**


**న్యూఢిల్లీ :**

బ్యాంకింగ్ సేవలను అందించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగ్గా పని చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు అన్నారు. రుణాల వృద్ధిలో ప్రయివేటు రంగ బ్యాంక్‌ల కంటే ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు బాగా ముందంజలో ఉన్నాయని ప్రశంసించారు. రుణాల పరిశీలన, రుణ ప్రమాణాలు, ప్రాజెక్ట్ రుణాల పర్యవేక్షణలో పిఎస్‌బిలు భారీ వృద్ధిని సాధించాయన్నారు. బుధవారం జలంధర్‌లోని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఎంఎస్ఎంఇ స్పోర్ట్స్ క్లస్టర్ శాఖను నాగరాజు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ బ్యాంకులు సామర్థ్యం, పారదర్శకత, విశ్వాసంపై దృష్టి సారించడం వల్ల వినియోగదారులు మళ్లీ వీటి వైపు ఆకర్షితులవుతున్నారు. భారత ఆర్థిక వృద్ధికి ముఖ్యమైన ఎంఎస్ఎంఇలు, స్టార్టప్‌లకు బ్యాంకులు మరింత మద్దతు అందించాలి." అని నాగరాజు కోరారు. ప్రతి కస్టమర్‌ను గౌరవంతో చూస్తూ, డిజిటల్ సేవలు సులభంగా, స్థిరంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూడలని సూచించారు. 'జలంధర్ క్రీడా పరిశ్రమ ఎంఎస్ఎంఇ అభివృద్ధి, ఆవిష్కరణ ప్రపంచ పోటీతత్వానికి ఒక ఉదాహరణ. ఈ కొత్త శాఖలు అందరినీ కలుపుకొని, రంగాల వారీగా వృద్ధిని ప్రోత్సహిస్తాయి. ఇవి ఔత్సాహికవేత్తలను బలోపేతం చేస్తాయి. ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. దేశ ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచుతాయి." అని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఎండి, సిఇఒ స్వరూప్ కుమార్ సాహో పేర్కొన్నారు.



# గణమైన నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రివర్యులు






పేదల పెన్నిధి... బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి...
ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసిన మహానేత...
ప్రతి ఇంటికి విద్య, వైద్యం అందించేందుకు కృషి చేసిన ప్రజా నాయకుడు...
ప్రజల సంక్షేమమే పరమావధిగా, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన దివంగత నేత స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు
ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైయస్సార్ గారి సేవలు, సంక్షేమ కార్యక్రమాలు ఎప్పటికీ చిరస్తాయిగా నీలేచ్చేవి
ఆయన ఆశయాలే మనకు మార్గదర్శకం...
ఆయన సేవలే ఘన నివాళులు ప్రజల గుండె చప్పుడు పేదల కన్నీళ్లు తుడిచిన
మీ నవ్వు, మీ అడుగుజాడలు, పేదవాడి కడుపు నింపిన మీ సంక్షేమ బాట, మీ ఆశయాలే మా ఊపిరి, మీ ప్రజాపాలనే మా సంకల్పం.

మిమ్మల్ని ఎప్పటికీ మరువం రాజన్న మర్వలేం
జోహార్ వైఎస్సార్

# సీఎం అయ్యే టైం వస్తే బ్రహ్మదేవుడు ఆపలేడు

## కాంగ్రెస్ ను కబ్జా చేయాలని చూస్తే ఊరుకోం

అన్వేషనేత్రం, నల్లగొండ :





నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మహానేత, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సభ నార్కెట్ పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరు అయ్యాయి. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా తాను రాజకీయాల్లో కొనసాగుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో రాజశేఖర్ రెడ్డికి నేటికీ లక్షలాది మంది అభిమానులు ఉన్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మేమంతా వైఎస్సార్ శిష్యులం. ఆయనను ఎప్పటికీ మరవలేమని వైఎస్సార్ ఇచ్చే స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చామని రాబోయేది వైఎస్సార్ యుగమేనని స్పష్టం చేశారు. నన్ను సీఎంగా చూడాలని కొందరు అంటున్నారు. దానికి సమయం, సందర్భం వచ్చినప్పుడు ఆ పదవికి బ్రహ్మదేవుడు కూడా అడ్డుపడలేడన్నారు.

### కొత్తవాళ్లు వచ్చి పార్టీని కబ్జా చేయాలని చూస్తే ఊరుకోము

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడం మంచిదేనని కొత్తవాళ్లు వచ్చి పార్టీని కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతాం అంటే అస్సలు సహించమని చెప్పారు నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగనివ్వమన్నారు. కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చి వైఎస్సార్ రాజ్యాన్ని పునరుద్ధరిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని, నిజమైన కాంగ్రెస్ వాదుల హక్కుల కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## నేడు మిర్యాలగూడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా

### ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న కేటీఆర్





కృష్ణా జలాల సాధన, రైతుల హక్కులు,కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా రైతు ధర్నా,సభ మూడు నియోజకవర్గాల నుంచి 30 వేల మంది జన సమీకరణ ఏర్పాట్లు పూర్తిచేసిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు

మిర్యాలగూడ,అన్వేషనేత్రం :

కాంగ్రెస్ పార్టీ కంచుకోట... ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే బీఆర్ఎస్ పార్టీ పాలక ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు సిద్ధమైంది. ప్రధానంగా నాగార్జునసాగర్ లో నీటి నిలువ సామర్థ్యం 536 అడుగులకు చేరినప్పటికీ రైతులకు సాగునీటికి ఎందుకు విడుదల చేయలేదు, రైతాంగానికి పంటల సాగుకు అవసరమైన హామీ ఇవ్వటంలో విఫలమైన సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సహా ఇతర ముఖ్య నేతలను రైతు వేదిక ధర్నా ద్వారా ప్రశ్నించనున్నారని తెలుస్తోంది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో పాలక ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు వైఫల్యాలపై ఇప్పటికే కార్యచరణ ప్రకటించి రంగంలోకి దిగిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరగనున్న రైతు మహాధర్నా జోష్ నింపనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక కృష్ణ జలాల్లో తెలంగాణకు రావలసిన వాటాను ఏపీ లోని పోతిరెడ్డిపాడు సహా వివిధ ప్రాజెక్టుల పేరిట తరలించకపోవడంతో పాటు... నాగార్జునసాగర్ ఆయకట్టు రైతాంగానికి నీటి విడుదలకు ప్రభుత్వం చొరవ చూపకపోవడం, కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో హామీల అమలులో వైఫల్యం, ఇతర అంశాలను టార్గెట్ చేస్తూ నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పి గ్రౌండ్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన రైతు ధర్నా చేపట్టనున్నారు. ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించనున్నారు.

30 వేల మంది జన సమీకరణ

నాగార్జునసాగర్, నల్గొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల నుంచి సుమారు 30 వేల మందిని రైతు ధర్నాకు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు తెలిపారు. రైతు ధర్నా బహిరంగ సభకు సంబంధించి బీఆర్ఎస్ యువనేత నల్లమోతు సిద్ధార్థ పర్యవేక్షణలో ఏర్పాట్లను పూర్తి చేశారు. రైతు ధర్నాకు సకాలంలో హాజరై సక్సెస్ చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు పార్టీ శ్రేణులను, రైతులను కోరారు.



## వెయ్యి రోజుల ప్రజాపాలన..




సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజుల మైలురాయిని చేరుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సంక్షేమాన్ని విస్తరించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు--మహిళలు--యువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యి రోజుల పాలన చరిత్రలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది..

మీ.
శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్

## డాక్టర్. వైయస్ రాజశేఖర్ రెడ్డి గారికి నివాళు లర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు...

పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ పార్టీలో కొత్త తరం నాయకులను తయారు చేసిన నాయకుడు, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనదైన శైలిలో, చిరకాలం గుర్తుండేలా పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిన మహనీయుడు స్వర్గీయ. ణతీ.ూా= గారి 17 వ వర్ధంతిని పురస్కరించుకొని ఈరోజు ఉదయం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ పక్షాన టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్-చైర్మన్ ణతీ. మడికొండ శ్రీను గారు ముఖ్యఅతిథిగా హాజరై ణతీ.ూా= గారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ణతీ.ూా= గారు అనేక ప్రజా సంక్షేమ పథకాలను రూపొందించి, పేద ప్రజల గుండెల్లో ఒక దేవుడిగా నిలిచిపోయాడని ణతీ. మడికొండ శ్రీను గారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గూడెల్లి సదన్ కుమార్ నాయకులు అల్లం రఘు నారాయణ, బొచ్చు భాస్కర్, లక్కం వసంత శంకర్, దాసరి ఉమా, పసుల బంటిబాబు తదితరులు పాల్గొన్నారు.









హైదరాబాద్

చలమల్ల కృష్ణరెడ్డి గారి కుమారుడి వివాహ రిసెప్షన్ కి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన., ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారు..మరియు చామల శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు

## “దళితులను అవమానించడం బీజేపీ--ఆర్ఎస్ఎస్ డీఎన్ఏలో భాగంగా మారింది”

### హెచ్.ఆర్. మోహన్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ -- ఎస్సీ డిపార్ట్‌మెంట్ అధికార ప్రతినిధి



ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారు సభ నిర్వహించిన వేదికను “శుద్ధీకరణ” పేరుతో హోమం చేయడం అత్యంత ఖండనీయమైన చర్య. ఇది ఒక వ్యక్తిని కాదు, దేశంలోని కోట్లాది దళితులను, గిరిజనులను, ఆదివాసీలను, బహుజనులను అవమానించే కులవివక్ష మనస్తత్వానికి నిదర్శనం.భారతీయ జనతా పార్టీకి మా సూటి ప్రశ్న -- దళితుడైన జాతీయ నాయకుడు వేదికపై మాట్లాడితే ఆ వేదికను శుద్ధి చేయాలనిపిస్తుందా? ఇదేనా మీ “సబ్‌కా సాథ్ -- సబ్‌కా వికాస్”? ఇదేనా రాజ్యాంగంపై మీ గౌరవం?దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రతి చర్యపై బీజేపీ వెంటనే దేశానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకపోతే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, బహుజనులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ద్వారా తగిన సమాధానం చెబుతారు.రాహుల్ గాంధీ దళితులు, బహుజనుల హక్కుల కోసం నిరంతరం నిలబడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని కాపాడేందుకు ఎప్పటికీ వెనుకడుగు వేయదు.బీజేపీకి హెచ్చరిక: కులవివక్ష, అంటరానితనం, ద్వేష రాజకీయాలను వెంటనే విరమించుకోండి. రాజ్యాంగాన్ని అవమానించే, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలు కొనసాగితే దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, గిరిజన, బహుజన సమాజంతో కలిసి విస్తృత ఉద్యమాలు నిర్వహిస్తాం.ఈ దేశాన్ని మనుస్మృతి కాదు... డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగమే నడిపిస్తుంది. కుల అహంకార రాజకీయాలకు ప్రజలే తగిన తీర్పు ఇస్తారు.





ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్నీ రకాల సౌకర్యాలు కల్పించేందుకు శాయశక్తులా తమ వంతు కృషి చేస్తామని నాంపల్లి గూడ్స్ షెడ్ లోని శ్రీ హనుమాన్ దేవాలయ ట్రస్టు బోర్డు పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయానికి నూతనంగా నియమించిన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గా చల్లపల్లి శ్రీ రామచంద్రమూర్తి, సభ్యులుగా ప్రవీణ్ పిల్లే, పిల్లి గురుమూర్తి, కాటెపాగ అనిల్ బాబు, కందికంటి సంధ్యారాణి లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సమాజంలో భక్తిభావం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. తమను పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఫిరోజ్ ఖాన్, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్, సహాయ కమిషనర్ కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ సురేఖ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# గోపాలనగర్‌లో ఘనంగా పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలు

## పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు -- పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ యువనాయకుడు గాదె శివ

హైదరాబాద్, సెప్టెంబర్ 2:

జనసేనాని, పవర్‌స్టార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలు గోపాలనగర్‌లో పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూత్ ఫోర్స్ సభ్యుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు గాదె శివ పాల్గొని పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాదె శివ మాట్లాడుతూ, "పవర్‌స్టార్ అనే పేరులోనే ఒక ప్రత్యేకమైన ఉత్తేజం ఉంటుంది. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా తనదైన మార్గంలో కష్టపడి ఎదిగిన వ్యక్తి పవన్ కళ్యాణ్ గారు. మెగాస్టార్ చిరంజీవి గారి తమ్ముడిగా కుటుంబ గౌరవాన్ని నిలబెట్టడమే కాకుండా, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు" అని కొనియాడారు. గోపాలనగర్‌లో పవన్ కళ్యాణ్ ఆశయాలు, సేవా







స్ఫూర్తితో ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ యూత్ ఫోర్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గాదె శివ అన్నారు. ప్రజాసేవ, అన్నదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు తదితర కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సమాజానికి తమ వంతు సేవ అందించడం సంతోషకరమైన విషయమన్నారు. యూత్ ఫోర్స్ సభ్యులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, బిల్డర్లుగా తమ వృత్తి జీవితంలో రాణిస్తూ, మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. "మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఒక సోదరుడిగా, కుటుంబ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరపున మీకు అండగా ఉంటాను" అని గాదె శివ హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ బండి రమేష్ గారికి మెగాస్టార్ చిరంజీవి గారంటే ఎంతో అభిమానం, గౌరవం ఉందని గాదె శివ తెలిపారు. చిరంజీవి కుటుంబం పట్ల బండి రమేష్ గారికి ఎల్లప్పుడూ మంచి అభిప్రాయం, అభిమాన భావన ఉంటుందని పేర్కొన్నారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటారని గాదె శివ అన్నారు. ప్రజాసేవ, ప్రజా సంక్షేమం కోసం అందరం పార్టీలకు అతీతంగా సమాజ అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. "సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని గాదె శివ కోరారు. ఈ కార్యక్రమంలో వసంత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు కిలారి బాబు గారు, వినోద్ గారు, సాయిబాబా చౌదరి గారు, చావా శ్రీనివాసరావు గారు, సుధీర్ గారు, రామారావు గారు, సురేష్ మారా గారు, వెంకట్ గారు, యూత్ ఫోర్స్ సభ్యులు అశోక్ గారు, కిరణ్ గారు, ప్రసాద్ గారు, అజయ్ గారు, దొరబాబు గారు, సురేష్ గారుతో పాటు పవన్ కళ్యాణ్ అభిమానులు, మిత్రులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. బిర్యానీ పొట్లాల పంపిణీ

పాల్వంచ, అన్వేషనేత్రం :



జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాల్వంచలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ యూత్ లీడర్, సోషల్ మీడియా సెక్రటరీ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు. ప్రజలకు బిర్యానీ పొట్లాలు అందిస్తూ పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని, సోషల్ మీడియా టీం సభ్యుడు సాయి తేజ, మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు కాసిం, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు మంజూర్ గారి చేతుల మీదుగా కూడా బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు. అలాగే జనసేన పార్టీ పాల్వంచ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళి.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అన్వేషనేత్రం :

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేతకు ఘన నివాళులు కొండ్రపోల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొండ్రపోల్ గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహానేత అని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి



కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల కోసం వైఎస్సార్ చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పనులకు రిబ్బన్ కట్ చేయడమేనా? నకిరేకల్‌కు కొత్తగా ఏం ఇచ్చారు: చిరుమర్తి

నల్లగొండ /నకిరేకల్ సెప్టెంబర్ 2 (అన్వేషనేత్రం ప్రతినిధి)

:కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నేతృత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఆరు గ్యారంటీల అమలు, ఎన్నికల సమయంలో






ఇచ్చిన 420 హామీలు, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, పేదల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ రోడ్డెక్కారు. నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించారు. వెయ్యి రోజుల పాలనలో అమలు కాని హామీలు, నెరవేరని వాగ్దానాలను 'బాకీ కార్డుల' రూపంలో ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారీ ధర్నా నిర్వహించారు.

నకిరేకల్‌కు కొత్తగా ఏం ఇచ్చారు?

కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించడం మినహా కాంగ్రెస్ ప్రభుత్వం నకిరేకల్ నియోజకవర్గానికి కొత్తగా చేసిందేమిటని చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులకు కొనసాగింపు ఇచ్చి వాటిని ప్రారంభించడం తప్ప కొత్తగా ఎన్ని ప్రాజెక్టులు మంజూరు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు రిబ్బన్ కట్ చేసి వాటిని తమ ఘనతగా చెప్పుకోవడం సరికాదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిరేకల్‌కు వచ్చే ముందు నియోజకవర్గానికి కొత్తగా ఏం మంజూరు చేశారో, ప్రజలకు ఏం చేశారో స్పష్టంగా చెప్పాలని చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న విధానాలకు పొంతన లేదని విమర్శించారు. వెయ్యి రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మానవహారం నిర్వహించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం - ఎస్సై విజయ్ సింహారెడ్డి.

## ? డిజిటల్ మోసాలపై ఓటీపీలు, ఫేక్ లింక్ లతో గుంజుతున్నారు.. సైబర్ కేటుగాళ్ల పట్ల బిగ్ అలర్ట్!

## ?కష్టార్జితం క్షణాల్లో గల్లంతు కావొద్దు.. అన్నపురెడ్డిపల్లిలో సైబర్ హెచ్చరికలు

అన్నపురెడ్డిపల్లి, అన్వేషనేత్రం :

మండలంలో సైబర్ నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు దూకుడు పెంచారు. సైబర్ జాగ్రూకత దివస్ ను పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల కోసం ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి డిజిటల్ యుగంలో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న మోసాలపై ఈ సదస్సులో విస్తృతంగా అవగాహన కల్పించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని లేదంటే కొద్ది క్షణాల్లోనే కష్టపడి సంపాదించుకున్న





సొమ్మును కోల్పోవాల్సి వస్తుందని అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా వస్తున్న ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి అధిక లాభాల ఆశతో పెట్టుబడులు పెట్టవద్దని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే నకిలీ వెబ్‌సైట్ లింకుల జోలికి అసలు వెళ్లవద్దని పోలీసులు స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు లేదా మరే ఇతర అధికార ప్రతినిధుల పేరుతో ఫోన్ చేసి మోసపూరిత మాటలతో ఓటీపీలు రాబట్టే కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ న్యూ, ాువీ ్రా×చీ, ఖు×్రా×చీ, జుఎ నంబర్లు అలాగే పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. ఒకవేళ కొద్దిపాటి పొరపాటున సైబర్ మోసగాళ్ల బారిన పడి నగదును కోల్పోతే, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కాలంతో పాటు మారుతున్న నేర తీరుతెన్నులపై ప్రజలు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని, తమ కుటుంబ సభ్యులను, ఇరుగుపొరుగు వారిని కూడా డిజిటల్ మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేసి బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్ సింహారెడ్డి కానిస్టేబుల్ కృష్ణ నరేష్, రమాదేవి, ఎస్బిఐ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్ :-

చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద - మోహన్ రెడ్డి గారి మనవరాలు, నూతన పట్టువస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన., ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## ఆట



# బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్..

పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ ఆజామ్ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ కాలం పాటు సెంచరీ చేయని బ్యాటర్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్‌గా గుర్తింపు పొందిన బాబర్ ఆజామ్.. సెంచరీల నిరీక్షణలో బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. 10 బంతుల్లో 8 పరుగులే చేసి జోష్ టంగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే కుప్పకూలింది. బాబర్ ఆజామ్ 2023 నుంచి ఒక్క సెంచరీ చేయలేదు. ఈ మధ్య కాలంలో అతను 36 ఇన్నింగ్స్‌లు ఆడాడు. దాంతో 2023 నుంచి టెస్ట్‌ల్లో సెంచరీ చేయకుండా అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో బాబర్ ఆజామ్ బౌలర్లతో పోటీపడుతున్నాడు. ఈ జాబితాలో మిచెల్ స్టార్క్(50), పాట్ కమిన్స్(47), మహమ్మద్ సిరాజ్(44), నాథన్ లయన్(41) వంటి ప్రముఖ బౌలర్లు బాబర్ ఆజామ్ కంటే ముందున్నారు. ప్రభాత్ జయసూర్య, తైజుల్ ఇస్లామ్‌తో కలిసి బాబర్ ఆజామ్ ఈ జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. స్పెషలిస్ట్ బ్యాటర్ అయిన బాబర్ ఆజామ్.. బౌలర్లతో పోటీపడటంపై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. పాకిస్థాన్ బ్యాటింగ్ కింగ్ బౌలర్లతో పోటీపడుతున్నాడని ఎగతాళి చేస్తున్నారు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ అజాన్ అవైస్(102 బంతుల్లో 7 ఫోర్లతో 46), సౌద్ షకీల్(16) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(4/11) నాలుగు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(3/26) మూడు వికెట్లు పడగొట్టాడు. జోష్ టంగ్(2/27) రెండు వికెట్లు తీసాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటైంది. జోర్డాన్ కాక్స్(55), జేమీ స్మిత్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. గస్ అట్కిన్సన్(45), జోష్ టంగ్(30 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. పాకిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ అబ్బాస్(4/73) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ అలీ(3/86) మూడు వికెట్లు పడగొట్టాడు. ఖుర్రమ్ షెహ్‌జాద్, అలీ ఉస్మాన్ తలో వికెట్ తీసారు. 180 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 81 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 261 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు ఘోర పరాజయం తప్పేలా లేదు.



# జర్మనీని చిత్తు చేసిన టీమిండియా

బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత మహిళల హాకీ జట్టుకు హాకీ ఇండియా 50 లక్షల రూపాయల భారీ నగదు పురస్కారాన్ని అనౌన్స్ చేసింది. ఆమ్‌స్టెల్‌వీన్ వేదికగా జరిగిన 5/6 క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 5 జట్టు జర్మనీని 3–1 తేడాతో ఓడించి భారత జట్టు ఐదో స్థానంలో నిలిచింది. 1974 లో జరిగిన ప్రారంభ ఎడిషన్‌లో నాల్గో స్థానం సాధించిన తర్వాత, గత 52 ఏళ్ల వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల జట్టు నమోదు చేసిన అత్యుత్తమ ఫలితం ఇదే. టోర్నీ ఆద్యంతం కేవలం నెదర్లాండ్స్ చేతిలో మాత్రమే ఓడిన భారత్, బలమైన చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లను డ్రాలతో నిలువరించి, సౌతాఫ్రికాను 6–1 తో చిత్తు చేసింది. ఈ ఘనతపై హాకీ ఇండియా ప్రెసిడెంట్ పద్మశ్రీ దిలీప్ టిర్కీ స్పందిస్తూ జట్టును కొనియాడాడు. "భారత మహిళల హాకీ చరిత్రలో ఇది నిజంగా ఒక అద్భుతమైన ఫలితం. 52 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌లో ఐదో స్థానాన్ని దక్కించుకోవడం జట్టు కఠిన శ్రమ, పోరాట పటిమకు నిదర్శనం. మా ప్రశంసలకు గుర్తుగా జట్టుకు 50 లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటిస్తున్నాను. ఇది రాబోయే టోర్నీల్లో మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు ప్లేయర్లకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపాడు. హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మాట్లాడుతూ కెప్టెన్ సలీమా టెటే బృందం దేశం గర్వించేలా చేసిందని, ఆసియన్ గేమ్స్ కు ముందు ఇది గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా గోల్స్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. భారత గోల్ కీపర్ బిచ్చు దేవి, డిఫెన్స్ విభాగం జర్మనీ పెనాల్టీ కార్నర్లను సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే హాఫ్ టైమ్ తర్వాత భారత జట్టు దూకుడు పెంచి, ఫలితాన్ని సాధించింది. 43వ నిమిషంలో ఇషికా చౌదరి రివర్స్ లిఫ్ట్ షాట్‌తో తొలి గోల్ సాధించి భారత్‌కు 1–0 ఆధిక్యం అందించింది. ఆ తర్వాత నిమిషంలోనే దక్కిన పెనాల్టీ కార్నర్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మార్చడంతో స్కోరు 2–0 తో డబులైంది. 47వ నిమిషంలో నవ్‌నీత్ కౌర్ మరోసారి అద్భుత ఫీల్డ్ గోల్ చేసి ఆధిక్యాన్ని 3–0 కి పెంచింది. 59వ నిమిషంలో జర్మనీ తరఫున లిన్ క్రింగ్స్ ఒక గోల్ సాధించి లోటును తగ్గించినప్పటికీ, భారత జట్టు పట్టు సడలించలేదు. వెటరన్ గోల్ కీపర్ సవితా పూనియా ఆఖరి క్వార్టర్‌లో కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను నిలువరించి భారత్ విజయాన్ని ఖాయం చేసింది. చీఫ్ కోచ్ జోర్డ్ మారిజ్నే మార్గదర్శకత్వంలో భారత్ 3–1 తో మ్యాచ్‌ను ముగించి ప్రపంచ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించింది.

# సౌతాఫ్రికాపై నమీబియా సంచలన విజయం!

ఓడలు బళ్ళు అవుతాయి, బళ్ళు ఓడలవుతాయి" అంటే ఇదేనేమో. వరల్డ్ బెస్ట్ క్రికెట్ టీమ్‌లో ఒకటైన సౌతాఫ్రికాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన నమీబియా చేతిలో ఘోర పరాభావం ఎదురైంది. జింబాబ్వే, నమీబియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో సఫారీ టీమ్ శుభారంభం చేయలేకపోయింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి నమీబియా 18 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఈ విజయంతో నమీబియా సరికొత్త చరిత్రను లిఖించింది. అంతర్జాతీయ టీ20ల్లో సౌతాఫ్రికాపై నమీబియాకు ఇది రెండో విజయం. గతేడాది జరిగిన ట్రై సిరీస్‌లోనూ నమీబియా 4 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. దాంతో సౌతాఫ్రికాను రెండు సార్లు ఓడించిన తొలి అసోసియేట్ టీమ్‌గా నమీబియా చరిత్రకెక్కింది. టీ20ల్లో సౌతాఫ్రికాను నెదర్లాండ్స్ ఒకసారి ఓడించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022లో ఆ జట్టు ఈ విజయం సాధించింది. మరే అసోసియేట్ టీమ్ సౌతాఫ్రికాను ఓడించలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్(38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60) హాఫ్ సెంచరీతో రాణించగా.. లౌరెన్ స్టీన్‌కాంప్(29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41) దూకుడుగా ఆడాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ప్రేనెలన్ సుబ్రాయెన్ మూడు వికెట్లు తీయగా.. డాన్ జాన్సెన్, బ్యోర్న్ ఫోర్టుయిన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. న్కోబాని మోకోయెనా, డెవాల్డ్ బ్రెవిస్ తలో వికెట్ తీసారు. అనంతరం సౌతాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లకు 145 పరుగులే చేసి ఓటమిపాలైంది. డెవాల్డ్ బ్రెవిస్(50 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75) రాణించినా ఫలితం లేకపోయింది. చివరి ముగ్గురు బ్యాటర్లు డకౌట్‌గా వెనుదిరగడం సౌతాఫ్రికా కొంపముంచింది. అయితే ఈ ముక్కోణపు సిరీస్‌కు సౌతాఫ్రికా ప్రధాన ఆటగాళ్లంతా దూరంగా ఉన్నారు. ద్వితీయ శ్రేణి టీమ్‌తో సౌతాఫ్రికా ఈ సిరీస్ ఆడుతోంది. ఏది ఏమైనా.. సౌతాఫ్రికాపై నమీబియా విజయం హాట్‌టాపిక్‌గా మారింది.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సినిమా CINEMA





# సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు.

# కిరణ్ అబ్బవరం మూవీకి హతః టైటిల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.



# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434